నేతన్నలను రోడ్డున వేసింది కాంగ్రెస్సే

తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత గూడూరి ప్రవీణ్, పక్కన జిందం చక్రపాణి, నాయకులు

- వంద రోజుల పాలనలోనే వారికి ఉపాధి కరువు
- పొట్టకూటి కోసం మళ్లీ వలస వెళ్లే పరిస్థితి
- టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి
- బతుకమ్మ చీరల ఆర్డర్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్

సిరిసిల్ల టౌన్, మార్చి 26: వందరోజుల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేసి.. నేతన్నలను రోడ్డున పడేసిందని టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ విమర్శించారు. పొట్టకూటి కోసం నేతన్నలు మళ్లీ వలస వెళ్లే పరిస్థితులు వచ్చాయని ఆవేదన చెందారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 9తర్వాత మంచి రోజు లు తెస్తామని చెప్పి, ప్రజల్ని మోసం చేసి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. వంద రోజుల పాలనలోనే నేతన్నల ఉపాధిని అడ్డుకుని వారిని రోడ్డున వేసిందని ఆరోపించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికులకు బతుకమ్మ చీరలు, రాజీవ్ విద్యామిషన్, రంజాన్, క్రిస్మస్, కేసీఆర్ కిట్స్ పథకాలకు సంబంధించి దాదాపు ₹3,400 కోట్ల ఆర్డర్లు అందించిందన్నారు. తద్వారా కార్మికులు చేతినిండా పనితో సంతోషకరమైన జీవనం సాగించారన్నారు. కంటితుడుపు చర్యలో భాగంగా 365రోజులు పని కల్పిస్తామని జీవో విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుండా ఏ విధంగా ఉపాధి కల్పిస్తుందో సంబంధిత క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి లేక సిరిసిల్లలో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో అనేక దుర్భర పరిస్థితులు ఉండేవన్నారు. నేత కార్మికుల విషయంలో రాజకీయాలు వద్దని సూచించారు. నేత కార్మికులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న యారన్ సబ్సిడీ, ఆసాములు, కార్మికులకు రావాల్సిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ, బృహత్తర సంకల్పంతో కేసీఆర్ నాడు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు అం దించారన్నారు. ఆసాములు, యజమానులు, ప్రజాప్రతినిధులను కాంగ్రెస్ బ్లాక్ మెయిల్ చేస్తున్నదని ఆరోపించారు. వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వకపోవడంపై నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి స్పందించాలన్నారు. ఆర్డర్లు, సబ్సిడీ లేక ఉపాధిని కోల్పోయిన నేతన్న చేతుల్లో కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిడ్డి రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ వంద రోజుల పాలనలో నేతన్నలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు వచ్చాయన్నారు. రాజకీయ కక్షసాధింపు మానుకొని నేతన్నల ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, రాపెల్లి దినేష్, గెంట్యాల శ్రీనివాస్, మ్యాన రవి, గుండ్లపల్లి పూర్ణచందర్, గడ్డం భాస్కర్, పోరండ్ల రమేశ్, సామల శ్రీనివాస్, మండల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

- ఏఆర్వో, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి
- సెక్టార్, పోలీస్ అధికారులకు శిక్షణ

మాట్లాడుతున్న ఏఆర్వో, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

కలెక్టరేట్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిరిసిల్ల ఏఆర్వో (అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్), అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల ఏఆర్వో పరిధిలోని సెక్టార్, పోలీసు అధికారులకు సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఆర్వో మాట్లాడుతూ, సెక్టార్, పోలీసు అధికారులు తమ పరిధిలోని పోలింగ్‌స్టేషన్లను బీఎల్‌వో లేదా గ్రామ ప్రత్యేకాధికారులతో కలిసి సందర్శించాలన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలను పర్యవేక్షించాలని తెలిపారు. పోలింగ్ తక్కువ నమోదైన కేంద్రాల వివరాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికలకు ఒక రోజు ముందు, ఎన్నికల రోజు నిర్వర్తించాల్సిన విధులను ఆర్డీవో రమేశ్ వివరించారు. పోలింగ్ రోజు ఉదయం నిర్వహించే మాక్ పోలింగ్, పోలింగ్ ముగిసిన అనంతరం చేయాల్సిన పనులపై సూచనలు చేశారు. అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా, సీ విజిల్, సువిధ, ఇతర ఎన్నికల యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించా రు. సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ షరీఫ్‌మొయినొద్దీన్, సెక్టోరియల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీవీసీ హాల్‌లో సంబంధిత అధికారులతో కలిసి ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వే ర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బం ది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 560పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 674మంది ప్రిసైడింగ్ అధికారులు, 674మంది సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 1,348మంది ఓపీవోలు మొత్తం 2696 మందిని కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 20శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఇక్కడ సీపీవో శ్రీనివాసాచారి, ఈడీఎం శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

నేత కార్మికులకు ఉపాధి కల్పించండి

- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై సీఎంకు వినతి పత్రం ఇచ్చేందుకు సేకరించిన సంతకాలను చూపిస్తున్న నేత కార్మికులు

రాజన్నసిరిసిల్ల, మార్చి 26(నమస్తే తెలంగాణ): పెండింగ్ బకాయిలు, యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ పవర్ లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు మంగళవారం సిరిసిల్లలో నేతన్నల సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపకుండా వెంటనే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. వస్త్ర పరిశ్రమ యజమానులకు పెండింగ్ బకాయిలు, యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలన్నారు. యజమానులు మూడునెలలుగా సాంచాలు బంద్‌పెట్టడం వల్ల వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఆకలితో అలమటిస్తూ అన్నమో రామచంద్రా.. అంటున్నా ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. ఒకవైపు పనిచేద్దామంటే పనిలేక, అప్పులు ఇచ్చేవారు లేక నేత కార్మికులు అరిగోస పడుతున్నారన్నారు. కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన కార్మికులకు ₹10వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఇక్కడ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, ఉడత రవి, నక్క దేవదాస్, గుండు రమేశ్, ఆడెపు సంపత్, ఒగ్గు గణేశ్ ఉన్నారు.

మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పరామర్శ

నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 26: నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావును మంగళవారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. మూడు రోజుల క్రితం ప్రకాశ్‌రావు తల్లి సావిత్రిబాయి మృతిచెందగా, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జడ్పీ మాజీ చైర్పర్సన్ తుల ఉమతో కలిసి చీర్లవంచ పరిధిలోని నాయినోరిపల్లెలో వారి ఇంటికెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ ఎంపీపీ పడిగెల మానస, నాయకులు పడిగెల రాజు, జక్కుల రవీందర్, జక్కుల నాగరాజు యాదవ్, బియ్యాల కొండల్‌రావు, పాపారావు, నాయిని కమలాకర్ రావు, బ్రహ్మం, వెల్పుల రాజు, శ్రీకాంత్, కోడం సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో..

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో గంగాధర మండలం రంగరావుపల్లె బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రొడ్ల వెంకటరెడ్డి కుటుంబసభ్యులను మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పరామర్శించారు. ఇక్కడ నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ చైర్పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు రాఘవరెడ్డి, బండ నర్సయ్య, ద్యావ మధుసూదన్‌రెడ్డి, జక్కుల నాగరాజు, దూలం సంపత్‌గౌడ్ ఉన్నారు.

నేటి నుంచి శివకల్యాణ మహోత్సవాలు

- రాజన్న ఆలయంలో ఐదు రోజులపాటు వేడుకలు
- ఆదిదంపతుల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

వేములవాడ టౌన్, మార్చి 26: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం నుంచి ఈ నెల 31 వరకు శివకల్యాణమహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం అభిజిత్‌లగ్న ముహూర్తంలో ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని నేత్ర పర్వంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శివపార్వతులు, భక్తులకు ఎండవేడిమి తగలకుండా కోల్‌కత్తా క్లాత్ డెకోరేషన్, చలువపందిళ్లు వేశామని వెల్లడించారు. కల్యాణ వేదికతోపాటు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించినట్లు తెలిపారు. శివకల్యాణ మహోత్సవాన్ని స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం 8.30గంటల నుంచి వివిధ రకాల పూజలు, గురువారం 10.30గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తమున ఆదిదంపతుల కల్యాణం ఆలయం బయట ఏర్పాటు చేసిన వేదిక అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, రాత్రి 8గంటలకు ఆదిదంపతులను పెద్దసేవపై పురవీధులగుండా ఊరేగిస్తామని ఆలయ స్థానాచార్యుడు వెల్లడించారు.

యాగశాల కోసం సిద్ధమైన మండపం

ఉద్యమకారుడికి పట్టం కడుదాం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు గెలిపించుకుందాం: కొండూరి

మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, మార్చి 26: రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన ఉద్యమకారుడు, కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని నాఫ్స్‌కాబ్ చైర్మన కొండూరి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లతో గజసింగవరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొండూరి మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో కరీంగనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ మన ప్రాంతానికి చేసిన అభివృద్ధిని స్వాగతిస్తూ, మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. ఎంపీగా ఉన్నప్పుడు సమస్యలపై లోక్‌సభలో అనేకసార్లు గళంఎత్తి వినోద్‌కుమార్ పోరాడినట్లు గుర్తు చేశారు. పని చేసే సత్తా ఉన్న వినోద్‌కుమార్‌ను సమష్టి కృషితో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఇక్కడ సహకార బ్యాంకు డైరెక్టర్ భూపతి సురేందర్, పీఏసీఎస్ చైర్మన్లు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దేవాగౌడ్, భాస్కర్, వైస్‌చైర్మన్ రామాంజగౌడ్, డైరెక్టర్లు ఉన్నారు.

ముస్తాబాద్, మార్చి 26: మండల కేంద్రంలోని మడేలేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 30న నిర్వహించే ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవానికి రావాలని రజక సంఘం నాయకులు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావును ఆహ్వానించారు. ఇక్కడ అధ్యక్షుడు మిడిదొడ్డి శేరయ్య, డీటీ దేవయ్య, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, MENENEE SUJATHA R/o. 4-97, KONDAPUR, MEDIPALLY, JAGITYAL, TS. I have Changed My Name As MENNENI SUJATHA W/o. MENNENI PRABHAKAR RAO
NT-328851

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు బైక్‌పై వెళ్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బైక్‌పైవెళ్లి పంటల పరిశీలన

రహీంఖాన్‌పేటలో ఎండిన పంటపొలాలను కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం పరిశీలించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో సాగునీరందక పంటపొలాలు ఎండిపోతున్నాయన్నారు. మార్పు పేరుతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పాత రోజులను తెచ్చిందని మండిపడ్డారు.
– ఇల్లంతకుంట, మార్చి 26

అంజన్న హుండీ ఆదాయం ₹2.21లక్షలు

వేములవాడ రూరల్, మార్చి 24: అగ్రహారం హనుమాన్ ఆలయంలో హుండీల లెక్కింపు ద్వారా ₹2,21,877 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎండపల్లి మారుతి తెలిపారు. ఈ నగదు మూడు నెలలది మాత్రమేనని ఆయన చెప్పారు. ఇక్కడ ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త గౌరిశెట్టి మహేందర్, మాజీ ధర్మకర్త చేపూరి నాగరాజు, పరిశీలకుడు శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ తనిఖీ

వేములవాడ, మార్చి 26: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ వరంగల్ డీఐజీ సుభాషిణి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డు గది, కంప్యూటర్ విభాగం, పలు రికార్డులను పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్ సురేంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

'పోషకాహారం'లో చేతివాటం

వేములవాడ, మార్చి 26: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారంలోనూ అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది చేతివాటం వేములవాడ పట్టణంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలో గాంధీనగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రానికి (కోడ్ నంబర్–049) ప్రభుత్వం అందించే పోషక పదార్థాలు గర్భిణులు, బాలింతలకు అందించకుండా కార్యకర్త ఫోర్జరీ సంతకాలతో కాజేస్తున్నదని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజంకు ఫిర్యాదు అందింది. దీంతో గత శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేసి, ప్రత్యేక విచారణ అధికారిగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ను నియమించారు. విచారణలో పోషకాహారంతో పాటు కోడిగుడ్లు సరిగా అందించలేదని తేలినట్లు సమాచారం. ఈ మేరకు ఘటనపై విచారణ జరుపుతున్నట్లు సీడీపీవో ఎల్లయ్య తెలిపారు.

మహిళల రక్షణే లక్ష్యం

ముస్తాబాద్, మార్చి 26: మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యమని ఏఎస్ఐ ప్రమీల పేర్కొన్నారు. షీ టీమ్ ద్వారా అందిస్తున్న సేవలపై మంగళవారం మండల కేంద్రంలోని నవజ్యోతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆపద సమయాల్లో 87126 56425 లేదా డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆరోపణలు అవాస్తవం

ముస్తాబాద్, మార్చి 26: అక్రమంగా భూమిని పట్టా చేసుకున్నారంటూ తన భర్త, కేటీఆర్ పీఏ కుంబాల మహేందర్‌రెడ్డిపై ఓ దినపత్రికలో ప్రచురించిన కథనం అవాస్తవమని కుంబాల స్పందన ఆవేదన వ్యక్తం చేసింది. నిజలు తెలుసుకోకుండా వార్తలు రాయడం సరికాదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ బిడ్డను అయిన తాను 2008లో కుంబాల మహేందర్‌రెడ్డిని ప్రేమ వివాహం చేసుకున్నానని.. ఆదర్శ వివాహం కింద ప్రోత్సాహకంగా భూమి ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ఏడో విడుత భూపంపిణీలో భాగంగా తన పేరిట ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో రెండెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అప్పటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడలేదని, కేటీఆర్ మంత్రి కాలేదని, మహేందర్‌రెడ్డి కేటీఆర్ పీఏగా లేరని స్పష్టం చేశారు. కష్టపడి బతుకుతున్న తమపై ఇలాంటి ఆరోపణలు చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో స్పందన పేరుపై ప్రభుత్వం అందించిన పట్టాదారు పాస్‌బుక్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష

కలెక్టరేట్, మార్చి 26: యాసంగి వరి పంట కోతకు వచ్చిన నేపథ్యంలో ఏప్రిల్ మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, సంబంధితశాఖల అధికారులతో కలిసి యాసంగి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎక్కడా కూడా ప్రజాప్రతినిధుల ఫొటోలు, రాజకీయ పార్టీల గుర్తులు ప్రతిబింబించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 259కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని, ఈ సీజన్‌లో గ్రేడ్–ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు ₹2,203, సాధారణ రకానికి ₹2,183 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రతి ధాన్యం కేంద్రం వద్ద మౌలిక వసతులు, టర్పాలిన్లు, క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ రా–రైస్ భారత ఆహార సంస్థకు సకాలంలో డెలివరీ చేసే విధంగా రైస్‌మిల్లులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. యాసంగి 2022–23 సీజన్‌కు సంబంధించి 95,416 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ భీమ్యానాయక్, పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, డీఏవో భాస్కర్, ఏడీఆర్‌డీవో శ్రీనివాస్, డీసీవో కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమాదేవి పాల్గొన్నారు.

స్కూల్ గ్రౌండ్‌లో

ఆడుతూనే కుప్పకూలి..

- ఎనిమిదో తరగతి విద్యార్థికి చిన్ననాటి నుంచే గుండెకు చిధ్రం
- పాఠశాల మైదానంలో ఆడుకుంటుండగా అస్వస్థత
- చికిత్స అందించేలోపే మృతి
- కందికట్కూర్‌లో విషాదం

ఇల్లంతకుంట, మార్చి 26 : అప్పటిదాకా తమతో సంతోషంగా గడిపిన ఆ బాలుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చిన్ననాటి నుంచే గుండెకు రంధ్రం ఉండగా.. పేదరికం కారణంగా ఆపరేషన్ చేయించకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కందికట్కూర్‌కు చెందిన ఏలేటి శ్రీనివాస్, జ్యోతి దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కొడుకులు. పెద్దోడు సాయి వరుణ్‌తేజ(13)కు ఫిట్స్ ఉండగా, చిన్నోడు సాయితేజ(12)కు గుండెలో రంధ్రం ఉన్నది. సాయితేజకు చిన్నప్పుడే గుర్తించినా ఆర్థికంగా లేకపోవడంతో ఆపరేషన్ చేయించలేదు. మందులు వాడతున్నారు. ఈ ఇద్దరు పిల్లలు స్థానిక పభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం ఒంటి పూట బడులు నడుస్తుండగా.. ఎప్పటిలాగే మంగళవారం పాఠశాలకు వెళ్లివచ్చారు. మధ్యాహ్న సమయంలో ఆడుకునేందుకని అన్నదమ్ములు ఇద్దరు స్నేహితులతో కలిసి మళ్లీ పాఠశాలకు వెళ్లారు. 3గంటల ప్రాంతంలో గ్రౌండ్‌లో ఆడుతుండగా సాయితేజ ఒక్కసారిగా అస్వస్థత చెందాడు. పక్కన మెట్లపై కూర్చొని పడిపోయాడు. అన్నతోపాటు తోటి విద్యార్థులు గమనించి వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందాడు. ఆపరేషన్ చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చే ఉండేది కాదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. సాయితేజ మృతిపై ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎస్పీ

వీర్నపల్లి, మార్చి26: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలు, స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. తమకు కేటాయించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గ్రామాల్లో బ్లూకోల్ట్స్, కోర్టు సిబ్బంది నిత్యం పెట్రోలింగ్ చేయాలని సూచించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

చందుర్తి, మార్చి 26: మర్రిగడ్